క్లుప్తంగా

చెరువులో చేప పిల్లల విడుదల



సి.బెళగల్ చెరువులో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని చెరువులో శుక్రవారం మత్స్యకారులు చేప పిల్లలను వదిలారు. గత రెండు రోజులుగా దాదాపు 10 లక్షల చేప పిల్లలను వారు చెరువులో వదిలారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు, రాజమండ్రి నుంచి చేప పిల్లలను కొనుగోలు చేసినట్లు మత్స్యకార సంఘం సభ్యులు తెలిపారు. ఎనిమిది నెలల తర్వాత మార్చి లేదా ఏప్రిల్‌లో చెరువులో చేపల వేటను ప్రారంభిస్తామని వారు తెలిపారు. మత్స్యకార సంఘం సభ్యులు ఎర్రన్న, హేసేన్, గైని వెంకటేష్, సుంకన్న, విష్ణు, రంగన్న, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందకు పాదయాత్ర



పాదయాత్రగా తరలివెళుతున్న భక్తులు

కోడుమూరు రూరల్: గూడూరు నుంచి ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం 50 మందికి పైగా భక్తులు కాలినడకన తరలివెళ్లారు. శ్రావణ మాసం పురస్కరించుకుని భక్తులు శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి మాలాధారణ ధరించి 40 రోజుల పాటు నియమ నిష్టలతో పూజలు నిర్వహించారు. ముడుపులను స్వామివారికి సమర్పించి స్వామి వారి సన్నిధిలో దీక్షలను విరమించనున్నారు. కాలినడకన వెళుతున్న భక్తులను సాగనంపేదుకు పట్టణవాసులు తరలివచ్చారు.

పకడ్బందీగా చెత్త సేకరణ



చెత్త సేకరణ గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

కల్లూరు: గ్రామాల్లో పకడ్బందీగా చెత్త సేకరణ నిర్వహించాలని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం నెరవాడ గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్ పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి (ఎస్‌డబ్ల్యూపీసీ)కి తరలించాలన్నారు. చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు.

నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి



నిర్మాణాలపై ఆరా తీస్తున్న పరమేశ్వరప్ప

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో చేపడుతున్న శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని నాణ్యతతో నిర్మించి త్వరగా పూర్తి చేయాలని, రాష్ట్ర దేవదాయశాఖ అధికారి స్థపతి పరమేశ్వరప్ప అన్నారు. శుక్రవారం ఆలయ పునఃనిర్మాణం నిమిత్తం సీజీఎఫ్ నిధులు రూ.1.25 కోట్లతో నిర్మిస్తున్న ఆలయానికి కేటాయించిన హద్దులు, కొలతలు తదితర వాటిపై ఆరా తీశారు. అలాగే నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు అత్యంత నాణ్యతగా, ఆధునిక అలంకరణలతో చేపట్టాలన్నారు. డీఈఈ శ్రీనివాసులు, ఏఈ కిషోర్, ఈఓ రామకృష్ణ, అర్చకులు నారాయణస్వామి, క్రిష్ణయ్య, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న కల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది

కల్లూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెట్లమల్లాపురం గ్రామంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గిపోవడం, పొగ తాగువారు, మద్యం సేవించు వారు, పౌష్టికాహారలోపం ఉన్న వారందరూ గళ్ల పరీక్ష, ఎక్స్ రే పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ ఎస్.భూపాల్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపయ్యా.. మమ్మేలయ్యా

- చవితి వేడుకలకు మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ
- ఆరోగ్యకరమైన పర్యావరణం సామాజిక బాధ్యత
- పీఓపీతో పర్యావరణానికి ముప్పు
- చైతన్యం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు



మట్టి వినాయక ప్రతిమలు

గడివేముల: వినాయకచవితి సందర్భంగా విగ్రహాల నిమజ్జనంతో ఏటా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతూనే ఉంది. పీఓపీ అనర్థాలపై స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు. ఈ నెల 27వ తేదీన గణపతి పండుగను జరుపుకోనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసేందుకు యువత ముందంజలో ఉన్నారు. పీఓపీ విగ్రహాల నిమజ్జనంతో కలిగే అనర్థాలపై ఇటీవల ప్రజల్లో కొంత మార్పు వస్తోంది. వినాయకచవితి కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. భారీ సంఖ్యలో పీఓపీ విగ్రహాలను ఇప్పటికే తయారు చేసేశారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఏర్పడే పర్యావరణ సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ప్రజలపై ఉంది. ఇవి భూమిలో త్వరగా కరగక నీటిలో జిప్సంగా మారి కాలుష్యానికి కారణమై నీటిలో ప్రాణ వాయువు స్థాయి తగ్గి జలచరాలకు ఇబ్బందిని కలిగిస్తాయి. భూమిలోకి నీటిని ఇంకనీయకుండా అడ్డుకుంటాయి. దీంతో నీరు ఆవిరై వృథా అవుతుంది. దీనికి తోడు ఇవి త్వరగా కరగవు. నీటి కాఠిన్యాన్ని పెంచి నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. ఇవి నీటిలో చేరి నీటి ఆమ్లత్వాన్ని, టీడీఎస్ (టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్) శాతాన్ని పెంచుతుంది. పీఓపీ తోపాటు ఉపయోగించే రంగులు, హానికరమైన పాదరసం, కాడ్మియం, సీసం చేరిన నీటిని తాగడంతో కిడ్నీలు, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. నీటిలో కలిసే థర్మోకోల్, ప్లాస్టిక్ పువ్వులు, వస్త్రాలతో నీటి కాలుష్యం ఎక్కువై అలాంటి అపరిశుభ్రమైన నీటిని తాగడం వల్ల మానవులకు, జీవులకు వ్యాధులు సోకే అవకాశం ఉంది.

పీఓపీ అంటే

జిప్సంను 120 నుంచి 180 డిగ్రీల వరకు వేడి చేస్తే పీఓపీ తయారవుతుంది. దీని రసాయన నామం కాల్షియం సల్ఫేట్ హెమీహైడ్రేట్. ఇది ఓ తెల్లటి నిర్మాణ పదార్థం. ఇది 25 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద నీటిలో ద్రావణీయత 0.3 గ్రాములుగా ఉండి నీటిలో ముందగానే వెంటనే ఓ గట్టి పదార్థంగా మారుతుంది. 18వ శతాబ్దంలో ప్యారిస్ చుట్టూ ప్రమాదకర పీఓపీ నిల్వలు లభ్యమయ్యే జిప్సంను భారీ స్థాయిలో మైనింగ్ చేసి దీన్ని తయారుచేయడంతో అప్పటి నుంచి దీనికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అనే పేరొచ్చింది. వాస్తవంగా దీన్ని విరిగిన ఎముకలు, కీళ్ల అచ్చులకు ఉపయోగిస్తారు. దీంతోపాటు ఇళ్ల పైకప్పులు, అలంకరణలు, నల్లబల్ల తయారు చేస్తారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) వల్ల జరిగే అనర్థాలపై పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. దీనికి తోడు పాఠశాలల్లో మట్టి వినాయకుల ఆవశ్యతను ఉపాధ్యాయులు పిల్లలకు వివరిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ పలువురు వీఐపీలు మట్టి ప్రతిమలనే వాడుదామంటూ తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు. కుమ్మర, శాలివాహన సంఘాలు మట్టి బొమ్మల ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి. దీంతో ప్రజలు మట్టి వినాయకులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మట్టి విగ్రహాల ధర చాలా తక్కువగా ఉంటుంది. ఇవి నీటిలో సులభంగా కరిగి కాలుష్యాన్ని కలిగించవు. చెరువులోని బంకమట్టిని ' తీయడం వల్ల నీటి నిల్వ శాతం పెరిగి భూగర్భజలాలు పెరుగుతాయి. వీటిని తయారు చేసే పని వాళ్లకు ఆర్థిక భరోసాతో పాటు వారిని ప్రోత్సహించినట్టే. కాబట్టి మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం. ఇది మనందరి బాధ్యతగా భావిద్దాం.

– డి.గఫూర్, విద్యావేత్త, గడివేముల

మట్టి గణపతిని పూజించాలి



వినాయక చవితికి మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి. దీనిపై విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దీంతో అటూ ప్రమాదాలు, పర్యావరణకు ఎంతో మేలు జరుగుతుంది. చిన్న విగ్రహాల ఏర్పాటుతో నిమజ్జనం రోజు సులువుగా ఉంటుంది. మట్టి విగ్రహాల వలనే కలిగే లాభాలను వివరిస్తున్నాం.

– నగిరి శ్రీనివాసులు, తెలుగు పాఠశాల సహాయకులు, జెడ్పీ స్కూల్, గడిగరేవుల

దివ్యాంగ పింఛన్ల రద్దుపై 25న ధర్నా



పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం నాయకులు డి.పార్వతయ్య, ఎస్ఎండీ షరీఫ్ స్పష్టం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పునర్విచారణ పేరుతో దివ్యాంగ పింఛనుదారులను వేధిస్తోందన్నారు. దివ్యాంగులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న వికలత్వం శాతాన్ని కుదించి పెన్షన్‌కు అనర్హులంటూ నోటీసులు ఇవ్వడం, మళ్లీ సదరం క్యాంపులకు వెళ్లాలని చెప్పడం దారుణమన్నారు. జిల్లాలో దాదాపు 10 వేల మంది వికలాంగ పెన్షన్లను సెప్టెంబ ర్ నుంచి తొలగించనున్న నేపథ్యంలో పునరుదర్ధించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

కర్నూలు(రూరల్): ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమంలో అందజేసిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని ఎమెల్యే బొగ్గుల దస్తగిరి హామీ ఇచ్చారు. మండలంలోని పసుపుల గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని అర్జీలు స్వీకరించారు.

స్వమిత్వ సర్వేను వేగవంతం చేయండి



భూపనపాడులో సర్వేపై ఆరా తీస్తున్న జేసీ విష్ణుచరణ్

పాణ్యం: జిల్లాలో జరుగుతున్న స్వమిత్వ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. శుక్రవారం పాణ్యం మండలం భూపనపాడు గ్రామంలో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్వమిత్వ సర్వేపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఈ నెల 31 నాటికి సర్వేను పూర్తి చేయాలన్నారు. పంచాయితీరాజ్ శాఖ ద్వారా సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయితీరాజ్ సెక్రటరీలు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి 188 గ్రామాల్లో స్వమిత్వ సర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సర్వే వల్ల ఎలాంటి ఎన్‌క్రోచ్‌మెంట్ సమస్యలు ఉండవన్నారు. ఎవరి ఆస్తి వారికే దక్కేందుకు సర్వే ఉపయోగపడుతుందన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఒక్కరికీ ప్రాపర్టీ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ప్రతిఒక్కరూ స్వమిత్వ సర్వే పూర్తయ్యే వరకు సహకరించాలన్నారు. డీపీఈఓ లలితబాయి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండవ రోజు గాలింపు

పాణ్యం: మండల కేంద్రంలో ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో గల్లంతైన యువకుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రెండవ రోజు కాల్వ వెంట ఈతగాళ్ల సాయంతో గాలించారు. బేతంచెర్ల మండలం గొరుమానుకొండకు చెందిన జగదీష్ కాల్వలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. రెండవ రోజు కూడా ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రను పకడ్బందీగా చేపట్టండి

కర్నూలు(సెంట్రల్): ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పలు అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు జిల్లాలో నిర్వహించే స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మాన్‌సూన్ హైజీన్ అనే థీమ్‌తో నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెరుగైన సేవలందించే వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చేలా అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. హొళగుంద మండలంలోని మద్దిలింగదహళ్లి, దేవనకొండ మండలం కరివేముల, పాలకుర్తి, ఆస్పరి, కైరుప్పల, కౌతాళం మండలం నదిచాగి, పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ, వెల్దుర్తి మండలం అల్లుగుండు, కోసిగి మండలంలోని వందనగల్లు తదితర గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ చేయడం లేదని ఫిర్యాదులు వచ్చాయని, ప్రతి గ్రామంలో చెత్త సేకరణ జరిగేలా చూడాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించాలన్నారు. ఫారం ఫాండ్స్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. జల్ సంచయ్ జన్ బాగీదరి పథకంలో భాగంగా గత మూడేళ్లలో చేపట్టిన డిస్టిలింగ్, నీటి సంరక్షణ, సోక్‌పిట్స్, ఫారం పాండ్స్‌లో పూర్తైన పనుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్వామిత్వలో భాగంగా పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను వారం రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

భూసమస్యలపై దరఖాస్తుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన ఆర్డీఓ సందీప్
- భూ సమస్యలపై 138 అర్జీలు



సి.బెళగల్ మండల పీజీఆర్ఎస్‌కు భారిగా తరలి వచ్చిన ప్రజలు

సి.బెళగల్: స్థానిక రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై నిర్వహించిన మండల స్థాయి ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్‌కు) రైతుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలోని సి.బెళగల్ గ్రామ సచివాలయం – 2లో పీజీఆర్ఎస్‌ను తహసీల్దార్ వెంకటలక్ష్మి నిర్వహించగా, కర్నూలు ఆర్డీఓ సందీప్, డీఏ సుబ్బారెడ్డి హాజరై రైతుల సమస్యలు తెలుసుకుని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. మండల పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు తరలిరావడంతో మండల పరిషత్ కార్యాలయం వద్ద రద్దీ నెలకొంది. కార్యక్రమంలో 138 అర్జీలు వచ్చాయని, భూముల ఆన్‌లైన్ సమస్యలపై 38 దరఖాస్తులు, జాయింట్ ఎల్‌పీఎం తొలగింపునకు 63 దరఖాస్తులు, భూముల సర్వే సమస్యల పరిష్కారానికి 53 అర్జీలు, ఇతరత్రా 11 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ రాణెమ్మ, డీటీ పురుషోత్తం, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, మండల సర్వేయర్ నాగభూషణం, ఆర్ఐ తరుణ్, ఇతర శాఖల మండల అధికారులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వే సహాయకులు, వీఆర్ఏలు, రైతులు ఉన్నారు.

ఇతర సమస్యలకు ఆసక్తి కరువు

పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ హాజరవుతారని తెలియడంతో గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున మండల కేంద్రానికి చేరుకున్నారు. అధికారులు భూ సమస్యలను విశ్లేషించి దరఖాస్తుదారులకు రసీదులను అందజేశారు. పలువురు అర్జీదారులు మండలంలో గ్రామాల రోడ్ల దుస్థితి, పొలాలకు వెళ్లే రస్తాల అధ్వాన పరిస్థితులు, ఆక్రమణలను తెలియజేసి, వాటిని పరిష్కరించాలని అధికారులను కోరారు. అయితే పై తరహా దరఖాస్తుల పరిశీలనపై, పరిష్కారానికి అధికారులు ఏమాత్రం ఆసక్తి చూపలేదని దరఖాస్తుదారులు వాపోయారు. పోలకల్ గ్రామానికి చెందిన పలువురు దివ్యాంగులు సదరంలో తమ వికలత్వ శాతంను భారీగా తగ్గించారని, తమకు పాత సదరం సర్టిఫికెట్ ప్రకారం వికలత్వ శాతం కొనసాగించి న్యాయం చేయాలని కోరగా వారిని మండల పరిషత్ కార్యాలయానికి పింపి చేతులు దులుపుకున్నారని దివ్యాంగులు, వారి సహాయకులు వాపోయారు.

పల్లకీలో కృష్ణ భగవానుడి విహారం



గ్రామంలో కృష్ణ భగవానుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని కొలువుంచిన స్వాముల వారి ప్రతిమను శుక్రవారం మధ్యాహ్నం అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాముల వారి ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని నందికొట్కూరు రోడ్డులో గల పాల డైరీ పక్కన కొలువుంచిన స్వాముల వారికి వారం రోజుల పాటు భక్తులు నిత్యపూజలు, భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అశేష జనసందోహాల మధ్య స్వాముల వారి ప్రతిమను పల్లకీలో ఆశీనులను గావించి, ప్రాంగణం నుంచి బయలుదేరి మెయిన్‌బజార్, రచ్చకట్ట మీదుగా ఆంజనేయస్వామి గుడి వరకు స్వాముల వారిని ఊరేగించారు. అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు శ్రీకృష్ణుడి నామస్మరణతో గీతాలు ఆలపించారు. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓర్వకల్లు, చింతలపల్లె ఉత్సవ కమిటీ సభ్యులు చిన్నపుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కుమారాచారి, సంజీవ, పార్థసారధి, నాగమద్దిలేటి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో ప్లాస్టిక్ కవర్లపై నిషేధం

- తనిఖీల్లో పట్టుబడితే చర్యలు
- సీ.క్యాంపు రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి ఆదేశం



ప్లాస్టిక్ నిషేధంపై సూచనలు చేస్తున్న ఎస్టేటు అధికారి కళ్యాణి

కర్నూలు(అగ్రికల్చర్): రైతుబజారులో ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు వాడితే చర్యలు తప్పవని సీ.క్యాంపు రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో రైతుబజారులోని వివిధ వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రైతుబజారులో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నగరపాలక సంస్థ అధికారులు ఆదేశించారని, ఈ నిషేధాన్ని వ్యాపారులందరూ తప్పక పాటించాలన్నారు. మున్సిపల్ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు లభించినా.. వినియోగం కనిపించినా భారీ ఎత్తున జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగ్‌లు, పేపర్ సంచులు వినియోగించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందగా ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి కట్టుబడితే పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసిన వాళ్ల అవుతారని పేర్కొన్నారు. హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం





దొడ్డిపాడులోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం


ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యాలు పెద్దటేకూరు గ్రామ పంచాయతీ మజారా గ్రామమైన దొడ్డిపాడులోనివి. కర్నూలు జిల్లాలో పెద్దటేకూరు గ్రామ పంచాయతీని మోడల్ పంచాయతీగా నిర్ణయించి ఇతర మండలాలకు చెందిన అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. అలాగే పారిశుద్ధ్యంపై అధికారులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే మజారా గ్రామమైన దొడ్డిపాడులో పారిశుద్ధ్య చర్యలను పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో సుమారుగా 1400 మంది జనాభా, 900 మందికిపైగా ఓటర్లు ఉన్నా పారిశుద్ధ్య లోపాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్‌ను వివరణ కోరగా దొడ్డిపాడు గ్రామం హంద్రీ నదికి అవతల ఉండటంతో ట్రాన్స్‌పోర్టు ఇబ్బందిగా మారింది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం అని చెప్పారు – కల్లూరు

ఎరువులను అందుబాటులో ఉంచాలి




ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్

సి.బెళగల్: రైతులకు నాణ్యమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని కర్నూలు ఆర్డీఓ సందీప్ సూచించారు. ఆయన శుక్రవారం సి.బెళగల్‌లోని రైతు సేవా కేంద్రాన్ని (ఆర్ఎస్‌కే) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌కేలో ఉన్న ఎరువుల రికార్డులను, నిల్వలను పరిశీలించి వివరాలను మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారులు, సిబ్బందితో ఆర్డీఓ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన మేరకు యూరియా, ఇతర ఎరువులను గ్రామాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎరువుల కొరత లేకుండా చూడాలని, నాణ్యమైన ఎరువులు ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచాలని, డీలర్ల దగ్గర అధిక ధరకు అమ్మకాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ సిబ్బంది ఆసిఫ్, శాలిని, ఎంపీఈఓ వెంకటేష్ తదితరులు ఉన్నారు.



పుట్ట నుంచి ఊడలు వచ్చినట్లుగా..



కొండ రాయి మధ్యలో పచ్చని చెట్టు

పిన్నాపురం.. ప్రకృతి అందాల సోయగం

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం ప్రకృతి అందాలకు నిలయం. వర్షాకాలం వచ్చిందంటే కొండ మొత్తం పచ్చబడి చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. పాణ్యం నుంచి 13 కి.మీ దూరం ఉన్న ఈ గ్రామానికి వెళ్లాలంటే కొండపై ప్రయాణం చేయాలి. కొచ్చెరువు నుంచి కొండపై ఘాట్ ప్రారంభమవుతుంది. వాహనాల్లో వెళ్లే వారు రోడ్డు కిరువైలా ఉన్న అందాలను తిలకిస్తారు. ఎటు చూసినా శిల్పులు తయారు చేసినట్లుగా పెద్ద బండ రాళ్లు, పొందికగా ఉన్న చెట్లు ఆకర్షిస్తాయి. అంతే గాక కొండపై దారి వెంట వందల సంఖ్యలో పుట్టలు ఉన్నాయి. ప్రతి పుట్టపై చెట్లు మొలచి చూపరులను ఆకర్శిస్తున్నాయి. ఓ పుట్టపై ఏళ్ల నాటి చెట్టు ఎండిపోయి ఊడల్లాగా కనిపిస్తుంది. పుట్ట కింద పచ్చటి చెట్లు ఉండడంతో చూపరులను కట్టిపడేస్తున్నాయి. వీటితో అక్కడక్కడ వర్షపు నీరు తొట్టిలో ఉంచినట్లు ఉంటాయి. నిత్యం పదుల సంఖ్యలో విద్యార్థులు ప్రకృతి సోయగాలను తిలకించి తమ ఫోన్‌లలో బంధిస్తుంటారు.



కూకటి వేళ్లతో కూలినా ఏపుగా పెరిగిన చెట్టు



పుట్టపై పెరిగిన భారీ వృక్షం